క్లుప్తంగా

రైల్లో నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

తెనాలి రూరల్: రైల్లో నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జీఆర్పీ ఎస్‌ఐ వెంకటాద్రి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చినరావూరు, జంపని స్టేషన్ల పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో పోలీసులు ఘటనా స్థలాన్ని ఆదివారం పరిశీలించారు. మృతదేహం గుర్తు పట్టేందుకు వీల్లేకుండా ఉంది. వయస్సు 40 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుంది. మృతి చెంది నాలుగు రోజులకు పైగా అవుతుందని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

చిత్రలేఖనం పోటీల్లో చిన్నారుల ప్రతిభ



తాడేపల్లిరూరల్: చిత్రలేఖనం పోటీల్లో చిన్నారులు ప్రతిభకనబరిచారు. మంగళగిరి– తాడేపల్లి బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో తాడేపల్లి పట్టణ పరిధిలోని ఆశ్రమం రోడ్డులోని అమరావతి ఐకాన్‌లో ఆదివారం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ సభకు బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా రంగిశెట్టి ఫౌండేషన్ చైర్మన్ రంగిశెట్టి రమేష్ హాజరై మాట్లాడారు. పిల్లల్లో సృజనాత్మకతను పెంచడానికి మంచి కార్యక్రమాన్ని నిర్వహించారని అన్నారు. సెల్‌ఫోన్‌లు వచ్చి బాలబాలికలను ఆటలకు దూరం చేస్తున్నాయని హెచ్చరించారు. చందమామ, బాలమిత్ర, పంచతంత్ర కథలు లాంటి పుస్తకాలు కనిపించడం లేదని పేర్కొన్నారు. మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం గౌరవ అధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు మాట్లాడుతూ బాలబాలికల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి ఈ పోటీలు ఉపయోగపడతాయని అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు రావూరి రమేష్‌బాబు మాట్లాడుతూ చిన్నారులు ఉత్సాహంగా చిత్రలేఖనం పోటీల్లో పాల్గొనడం అభినందించదగ్గ విషయమని అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి కార్యదర్శి సుకుమార్ రెడ్డి మాట్లాడుతూ పిల్లల్లో పోటీతత్వం పెరగడానికి ఈ పోటీలు దోహదం చేస్తాయని అన్నారు. బాలోత్సవం రాష్ట్ర బాధ్యులు పిన్నమనేని మురళీకృష్ణ మాట్లడుతూ బాలబాలికలు చదువుతో పాటు చుట్టుపక్కల జరుగుతున్న అనేక సమాజ పరిణామాలను కూడా గమనించాలని సూచించారు. అనంతరం డాన్స్ మాస్టర్ చందు ఆధ్వర్యంలో బాలబాలికలు వివిధ రకాల డ్యాన్సులు, స్వాతంత్య్ర పోరాట స్ఫూర్తిని ప్రతిబింబించే నృత్య ప్రదర్శనలు, కోలాటం ప్రదర్శించారు. కాజ నుంచి బాలల సంఘం బాధ్యులు సింహాద్రి సుమ ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఎక్కడ వచ్చిందమ్మ స్త్రీ జాతికి స్వాతంత్య్రం ? నృత్య రూపకం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎం.సంధ్యారాణి, ఇ.రాజశేఖర్, విక్రమ్, జి.రమ్య, వై.అచ్యుతరావు, పి.విజయ, నాగరాజు, వెంకటరావు, జి.సుమ, వై.సౌజన్య, ప్రకాష్ పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు



మంగళగిరి: పట్టణంలో తోపుడు బండ్లు, కూరగాయల బండ్లు ట్రాఫిక్ ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ వినోద్ కుమార్ హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని మెయిన్ బజార్, గౌతమబుద్ధా రోడ్డులో పర్యటించి తోపుడు బండ్ల, కూరగాయల వ్యాపారులు, చిరు వ్యాపారులు తమ వ్యాపారానికి వాడే బండ్లు వగైరాలను రోడ్లపై ఉంచి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించకుంచకుండా చూడాలన్నారు. చిరువ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులు అధికారులు కేటాయించిన స్థలాల్లో వ్యాపారం చేసుకుని, అధికారులకు సహకరించాలని కోరారు.

బుద్ధదేవ్ భట్టాచార్యకు ఘన నివాళి

తాడేపల్లిరూరల్: పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, కమ్యూనిస్టు పార్టీ నాయకుడు బుద్ధదేవ్ భట్టాచార్య మృతికి ఆదివారం పలువురు నివాళులర్పించారు. ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో సీపీఎం నాయకులు భట్టాచార్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకట రెడ్డి మాట్లాడుతూ 11 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ప్రజలకు సుపరిపాలన అందించడమే కాక, పేద, బడుగు బలహీన వర్గాల పోరాటాలకు సారథ్యం వహించారని, ప్రభుత్వ రంగ సంస్థల బలోపేతం చేసేందుకు పారిశ్రామిక రంగాన్ని ముందుకు తీసుకువెళ్లారని అన్నారు. కార్యక్రమంలో కుంచనపల్లి గ్రామ శాఖ కార్యదర్శి అమ్మిశెట్టి రంగారావు, నాయకులు సింగంశెట్టి రవికిషోర్, సాంబిరెడ్డి, బాకీ శ్రీనివాసరావు, ఎ.అర్జున్‌రావు, ఎ.శివ పాల్గొన్నారు.

రణరంగ చౌక్ సిద్ధం

- నేడు అమరవీరుల సంస్మరణ దినోత్సవం
- ఏర్పాట్లు చేస్తున్న మున్సిపల్ అధికారులు
- హాజరుకానున్న మంత్రి మనోహర్, కలెక్టర్ నాగలక్ష్మి



రణరంగ చౌక్‌లో సూచనలిస్తున్న ఇన్‌చార్జి ఎంఈ శ్రీనివాసరావు

తెనాలి అర్బన్: క్విట్ ఇండియా ఉద్యమంలో అమరులైన స్వాతంత్య్ర సమరయోధులకు నివాళులర్పించేందుకు తెనాలిలోని రణరంగ చౌక్ సిద్ధమైంది. ఆనాటి అమరుల్ని స్మరించుకోవడంతోపాటు నివాళులర్పించడం, స్వాతంత్య్ర సమరయోధులకు సన్మానం వంటి కార్యక్రమాల కోసం సభా వేదికను ఏర్పాటు చేశారు. క్విట్ ఇండియా ఉద్యమం సమయంలో తెనాలికి చెందిన ఏడుగురు స్వాతంత్య్ర సమరయోధులు అసువులు బాసిన విషయం తెలిసిందే. వారిని స్మరించుకునేందుకు అప్పటి పాలకులు రణరంగచౌక్‌లో ఏడు స్తూపాలు ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఆగస్టు 12న సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం తెనాలి పాత బస్టాండ్ సమీపంలోని రణరంగచౌక్ వద్ద అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఉదయం 9గంటలకు నిర్వహించేందుకు తెనాలి పురపాలక సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది.

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో...

వైఎస్సార్‌సీపీ తెనాలి నియోజకవర్గం ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఉదయం 9 గంటలకు రణరంగ చౌక్ వద్ద నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొని స్తూపాలకు నివాళులర్పిస్తారని చెప్పారు. కౌన్సిలర్లు, సర్పంచులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

టీడీపీ ఆధ్వర్యంలో...

తెలుగుదేశం పార్టీ తెనాలి నియోజకవర్గం ఆధ్వర్యంలో అమరవీరుల్ని స్మరించుకునే కార్యక్రమాన్ని ఉదయం 10గంటలకు రణరంగ చౌక్ వద్ద నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగే నివాళుల కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు.

కార్యక్రమాలు ఇలా..



త్రీ టౌన్ పోలీసుస్టేషన్ ముందు ఏర్పాటు చేస్తున్న సభా వేదిక

ఉదయం 8గంటలకు బుర్రిపాలెం రోడ్డులోని పాత ప్రభుత్వ వైద్యశాల నుంచి మార్చిఫాస్ట్ (ర్యాలీ) నిర్వహించనున్నారు. అక్కడి నుంచి గాంధీచౌక్, మెయిన్ రోడ్డు, మార్కెట్ మీదుగా రణరంగచౌక్‌కు 8.30 గంటలకు చేరుకుంటుంది. అక్కడున్న స్తూపాలకు పూల మాలలువేసి నివాళులర్పిస్తారు. ఉదయం 9 గంటలకు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ ముందు ఏర్పాటు చేసిన వేదిక వద్ద సభను నిర్వహిస్తారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన జరిగే సభలో ముఖ్య అతిథిగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, విశిష్ట అతిథిగా కేంద్ర గ్రామీణ అభివృద్ధి, సమాచార సహాయక మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, గౌరవ అతిథులుగా జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్, సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్, 22వ ఆంధ్రా బెటాలియన్ కమాండిగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ జె.మహేష్, డీఎస్పీ డి.జనార్దనరావు, తహసీల్దార్ కె.వి.గోపాలకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, కౌన్సిలర్ పేరం సంజీవ రెడ్డి పాల్గొంటారు. అనంతరం స్వాతంత్య్ర సమరయోధులు, అమరవీరుల కుటుంబ సభ్యులు, వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనపరచిన ప్రముఖుల్ని సన్మానిస్తారు. సోమవారం నుంచి గురువారం వరకు అంతా ఇళ్లపై త్రివర్ణ పతకాన్ని ఎగురవేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం జరిగే అమరవీరుల సంస్మరణ సభలో అంతా పాల్గొనాలని కోరారు.

డెప్యూటీ కలెక్టర్‌గా సూర్యనారాయణ సేవలు ప్రశంసనీయం



సూర్యనారాయణ దంపతులను సన్మానిస్తున్న మంత్రులు సవిత, మనోహర్, ఎమ్మెల్యే ఆనంద్‌బాబు

తెనాలి అర్బన్: డెప్యూటీ కలెక్టర్‌గా రాచాబత్తుని వెంకట సూర్యనారాయణ సేవలు ప్రశంసనీయమని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రశంసించారు. ఉద్యోగ విరమణ చేసిన సూర్యనారాయణ అభినందన సభను పద్మశాలీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ముత్తెంశెట్టిపాలెంలోని సొసైటీ కల్యాణ మండపంలో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు మాట్లాడుతూ తాను మంత్రిగా పనిచేసిన సమయంలో ఓఎస్‌డీగా సూర్యనారాయణ పనిచేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం మంత్రి సవిత వద్ద ఓఎస్‌డీగా పనిచేస్తున్నట్లు చెప్పారు. ఎంతో నిబద్ధతతో వ్యవహరించేవారని తెలిపారు. అనంతరం సూర్యనారాయణ దంపతుల్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు జొన్నాదుల నరసింహారావు, రాచాబత్తుని బ్రహ్మం, రాచాబత్తుని శ్రీనివాసరావు, జొన్నాదుల మహేష్, దివి హేమంత్ కుమార్, ప్రభాకరరావు పాల్గొన్నారు.

ఆర్య వైశ్యులంతా ఐక్యంగా ఉండాలి



నూతన కార్యవర్గ సభ్యులతో మంత్రి మనోహర్, మాజీ మంత్రులు రాజేంద్రప్రసాద్, టీజీ వెంకటేష్

> రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్


తెనాలి అర్బన్: ఆర్య వైశ్యులంతా ఐక్యంగా ఉంటూ సమస్యల్ని పరిష్కరించుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, మాజీ మంత్రులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, టీజీ వెంకటేష్ సూచించారు. ఆర్య వైశ్య జిల్లా యువజన సంఘం, వాసవీ యూత్ తెనాలి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో శనివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆర్య వైశ్యులు ఎంతో సౌమ్యులని, వారికి అండగా ఉండాల్సిన బాధ్యత తమపై ఉందని తెలిపారు. ఆర్య వైశ్యులకు ఎటువంటి కష్టం వచ్చినా తమ దృష్టికి తేవాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ఆర్య వైశ్యులకు అండగా ఉంటుందని చెప్పారు. అనంతరం ఆర్య వైశ్య జిల్లా యువజన సంఘం అధ్యక్షుడిగా కొప్పరావూరి హరికిశోర్, ప్రధాన కార్యదర్శిగా లింగంశెట్టి శ్రీనివాస్, వాసవీ యూత్ తెనాలి అధ్యక్షుడిగా మాజేటి బదరీ కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా చీమకుర్తి సతీష్‌కుమార్‌తో పాటు కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం వారిని అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య మహాసభ రాష్ట్ర గౌరవాధ్యక్షులు, అధ్యక్షులు పెనుకొండ సుబ్బరాయుడు, చిన్నరామ సత్యనారాయణ, ఆర్య వైశ్య ప్రముఖులు నూకల వెంకట వేణుగోపాలరావు, పెండేల వెంకట్రావు, మునగాల శ్యామ్‌ప్రసాద్, పెండేల సుబ్బారావు, నాళం రజనీ కుమార్, కర్పూరపు రఘునాథమూర్తి, గోనుగుంట్ల శ్రీనివాసరావు, భాస్కరుని శ్రీనివాసరావు, అప్పల సునీల్‌కుమార్, సుగ్గుల శ్రీనివాసరావు, వెల్లంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

రూరల్ సీఐగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ



తెనాలి రూరల్: సార్వత్రిక ఎన్నికల అనంతరం జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా తెనాలి రూరల్ సీఐగా బెల్లం శ్రీనివాసరావు నియమితులయ్యారు. కొత్తపేటలోని రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఉదయం ఆయన బాధ్యతలు స్వీకరించారు. 1995వ బ్యాచ్‌కు చెందిన బెల్లం శ్రీనివాసరావు రేంజ్ పరిధిలో పలుచోట్ల ఎస్‌ఐగా పని చేశారు. 2010లో సీఐగా పదోన్నతి పొంది సీసీఎస్ గుంటూరు, లాలాపేట, తెనాలిలో పని చేశారు. 1999–2000లో తెనాలి టూ టౌన్ ఎస్‌ఐగా కూడా పని చేశారు.సీఐగా పదోన్నతి పొంది తెనాలి వన్‌టౌన్, త్రీ టౌన్ , రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా సేవలందించారు. తెనాలిపై ఆయనకు పూర్తి అవగాహన ఉంది. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడి సమస్యల్ని పరిశీలించి ఉన్నతాధికారుల ఆదేశాలతో వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలియజేశారు. ముఖ్యంగా రౌడీషీటర్ల కదలికలపై పూర్తి నిఘా ఉంటుందని, అసాంఘిక కార్యకలాపాలు, చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఆయన్ను రూరల్ ఎస్‌ఐ పి. కోటేశ్వరరావు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఖాళీ స్థలాలతో పారిశుద్ధ్య సమస్యలు



కొల్లిపర: మండలంలోని తూములూరు, కొల్లిపర, వల్లభాపురం, మున్నంగి, అత్తోట గ్రామాల్లో ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలతో పారిశుద్ధ్య ఇబ్బందులు తలెత్తుతున్నాయి.యజమానులు పట్టించుకోకపోవడంతో వర్షాలు పడిన సమయంలో పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఖాళీ స్థలాల్లో చెత్త పేరుకుపోయింది. దోమలు పెరిగి పారిశుద్ధ్యం క్షీణిస్తోంది. చుట్టూ ఉన్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి పోతున్నాయి. దోమలు ,విషసర్పాలకు ఆవాసంగా మారుతున్నాయి. వర్షపు నీటికి పిచ్చి మొక్కలు కుళ్లిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. పంచాయతీ అధికారులు కూడా పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వయనాడ్ వరద బాధితులకు విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న నాయకులు

తెనాలి: అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) పిలుపు మేరకు కేరళ రాష్ట్రంలోని వయనాడ్ వరద బాధితుల సహాయార్థం ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం తెనాలి రూరల్ మండలం గుడివాడలో విరాళాలు సేకరించారు. మొత్తం రూ.2,750 వసూలు చేసి రాష్ట్ర కమిటీకి పంపినట్టు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి వెల్లడించారు. పది రోజుల కిందట వయనాడ్‌లో వరద తీవ్ర నష్టం కలిగించినట్టు గుర్తుచేశారు. వందలాది మంది ప్రాణాలు కోల్పోయారని, మరెంతో ఆస్తి నష్టం కలిగిందని చెప్పారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కేరళలోని వయనాడ్‌కు వచ్చి చూసి వెళ్లారేగానీ ఎలాంటి సాయం ప్రకటించక పోవడం విచారకరమని ఖండించారు. విరాళాలు ఇచ్చిన గ్రామస్తులకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు కొల్లిపర బాబూప్రసాద్, షేక్ హుస్సేన్‌వలి, ఎస్.రాజ్యలక్ష్మి, ఎం.సాంబశివరావు, జ్యోతుల కోటేశ్వరరావు, బండి సుధాకర్ పాల్గొన్నారు.

ఆలనా‘పాలన’ లేని జిల్లా వైద్యశాల

- ఆస్పత్రి గదికి నిప్పుపెట్టిన కేసులో అరెస్ట్ అయిన వ్యక్తికి సూపర్‌వైజర్ పోస్ట్
- ఉద్యోగుల నియామకంలో అధికారులను విస్మరిస్తున్న సంస్థలు
- ఆందోళనలో అధికారులు, సిబ్బంది



తెనాలిలోని జిల్లా వైద్యశాల

తెనాలి అర్బన్: తెనాలి జిల్లా వైద్యశాల పాలన గాడితప్పింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆస్పత్రి గదికి నిప్పుపెట్టిన కేసులో అరెస్ట్ అయిన వ్యక్తికి శానిటేషన్ సూపర్‌వైజర్ పోస్టును టీడీపీ నాయకులు అప్పగించారు. దీంతో అటు అధికారులలో ఇటు సిబ్బందిలో అందోళన వ్యక్తం అవుతోంది. వైద్యశాలలో 200 పడకలు, తల్లీపిల్లల వైద్యశాలలో 100 పడకలు ఉన్నాయి. జిల్లా వైద్యశాలలో ప్రతిరోజు సుమారు వెయ్యి మంది ఓపీ, తల్లీపిల్లల వైద్యశాలలో 90 ఓపీ ఉంటుంది. వీరితో పాటు ప్రతిరోజు రెండు వైద్యశాలల్లో 250 మందికి పైగా ఇన్‌పేషెంట్లు ఉంటారు. వైద్యశాలలో ఆక్సిజన్ ప్లాంట్‌లు, ఎస్ఎన్‌సీయు, అధునాతన ల్యాబ్‌లు, వార్డులు ఉంటాయి. వీటన్నింటినీ ఆర్ఎంవో సహకారంతో వైద్యశాల సూపరింటెండెంట్ పర్యవేక్షిస్తుంటారు. శానిటేషన్ బాధ్యతలను ఫస్ట్ ఆబ్జెక్టు సంస్థకు, సెక్యూరిటీ బాధ్యతలను కార్తికేయ సెక్యూరిటీ సంస్థకు ప్రభుత్వం అప్పగించింది. వాస్తవంగా వాటి గడువు మే నెలతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా టెండర్లు పిలవకుండా మూడు నెలలు పాత సంస్థలకే బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, శానిటేషన్ బాధ్యతలు చూసే సంస్థ స్థానిక ప్రజాప్రతినిధులు సూచించిన వ్యక్తిని సూపర్‌వైజర్‌గా నియమించటం పరిపాటిగా మారింది. సదరు వ్యక్తికి ఆస్పత్రి శానిటేషన్ బాధ్యతలు పూర్తిగా అప్పగించి, వారికి జీతంతో పాటు శానిటేషన్ నిర్వహణను అప్పగిస్తున్నారు.

వివాదాస్పద వ్యక్తికి పోస్ట్

కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తెనాలి జిల్లా వైద్యశాలలో శానిటేషన్ సూపర్‌వైజర్ పోస్టును సదరు సంస్థ వివాదాస్పద వ్యక్తికి అప్పగించింది. టీడీపీలో ఉన్న అతడు అప్పటి ప్రజాప్రతినిధి సూచన మేరకు సూపర్‌వైజర్‌గా పనిచేశాడు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన కొంత కాలానికి సదరు సంస్థ అతడ్ని విధుల నుంచి తొలగించింది. దీంతో 2022 జనవరి 11న జిల్లా వైద్యశాలలోని గదికి నిప్పుపెట్టాడు. దానిలోని పరుపులు, ఇతర వస్తువులు కాలిపోయాయి. అక్కడే ఉన్న ఆక్సిజన్ సిలెండర్‌లకు నిప్పు అంటుకోకపోవటంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ విషయం సీసీ కెమెరాల్లో రికార్డు కావటంతో సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. ఇలాంటి వ్యక్తికి కూటమి నాయకులు మరలా శానిటేషన్ సూపర్‌వైజర్ పోస్టును అప్పగించారు. దీంతో వైద్యులు, సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏమి జరుగుతుందో అనే భయం వారిని వెంటాడుతోంది.

అధికారులకు తెలియకుండా నియామకాలు



గదికి నిప్పు పెట్టడంతో కాలిపోయిన వస్తువులు

జిల్లా వైద్యశాలలోని శానిటేషన్, సెక్యూరిటీ విభాగాల నిర్వాహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించటంతో ప్రభుత్వం మారిన వెంటనే ఆయా సంస్థల నిర్వాహకులు స్థానిక ప్రజాప్రతినిధుల సూచన మేరకు సిబ్బందిని తొలగించటం.. కొనసాగించటం చేస్తుంటారు. తెనాలి జిల్లా వైద్యశాల పరిధిలో రెండు విభాగాల పరిధిలో 94 మంది పనిచేస్తుంటారు. వీరిలో కొందరిని ఇప్పటికే టీడీపీ నాయకులు మార్చివేశారు. మిగిలిన వారిని మార్చే పనిలో ఉన్నారు. అయితే, నూతనంగా నియమించిన వారి వివరాలు జిల్లా వైద్యశాలకు అందజేయకపోగా కనీసం బాధ్యతలు స్వీకరించిన వారు సైతం వైద్యశాల అధికారులకు మర్యాదపూర్వకంగా కలవడం చేయడం లేదు. దీంతో ఎవరు ఉద్యోగులో.. ఎవరు కొత్తవారో తెలియక ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ఆస్పత్రి అధికారి వార్డులలో పర్యటిస్తుండగా కొత్త వ్యక్తి వారి వెంట ఉండటంతో ఎవరు మీరని? ప్రశ్నించారు. తాను శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్నానని చెప్పడంతో అవాక్కు కావటం అధికారుల వంతు అయింది. ఇప్పటికై నా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ఇలాంటి వ్యక్తుల్ని ఆస్పత్రి విధుల నుంచి తొలగించటంతో పాటు అధికారులు, సిబ్బందికి భరోసా కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనిపై సెకండరీ హెల్త్ జిల్లా కో–ఆర్డినేటర్ సుబ్రహ్మణ్యరాజును వివరణ కోరగా ఆస్పత్రిలో నిప్పుపెట్టిన వ్యక్తిని శానిటేషన్ సూపర్‌వైజర్‌గా నియమించిన సంగతి తెలియదన్నారు. నిబంధనల ప్రకారం అలాంటి వారిని నియమించకూడదని, వెంటనే దీనిపై విచారణ జరుపుతామని తెలిపారు. ఆస్పత్రిలో ఎవరినైనా నియమిస్తే అధికారులకు సదరు ప్రైవేటు సంస్థలు తెలియజేయాల్సిన బాధ్యత ఉందని స్పష్టం చేశారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విస్తృత సేవా కార్యక్రమాలు

> సర్వసభ్య సమావేశంలో నిర్ణయం



రోటరీ క్లబ్ మెంబర్‌షిప్ ర్యాలీ

తెనాలి: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో ఆగస్టులో విస్తృత సేవా కార్యక్రమాలు, సభ్యత్వ నమోదు చేపట్టాలని నిర్ణయించారు. స్థానిక రైల్వేస్టేషను రోడ్డులోని గౌతమ్ గ్రాండ్ హోటల్‌లో ఆదివారం జరిగిన క్లబ్ సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు నిర్ణయాల్ని తీసుకున్నారు. క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. చిరు వ్యాపారులకు ఈనెల 21న తోపుడు బండ్ల పంపిణీ, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో సిమెంటు బెంచీల ఏర్పాటుకు నిర్ణయించారు. ఆ కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. రక్తదాన శిబిరం నిర్వహణకూ నిర్ణయం తీసుకున్నారు. రొటేరియన్లు డాక్టర్ రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం, డాక్టర్ డి.జీవనలత నేతృత్వంలో హైస్కూలులో బాలికలకు ఆరోగ్య అవగాహన శిబిరం నిర్వహణపై చర్చించి, నిర్ణయాలు తీసుకున్నారు. ఆయా కార్యక్రమాల్ని విజయవంతం చేయాలని సభ్యుల్ని కోరారు. అనంతరం గౌతమ్ గ్రాండ్ హోటల్ నుంచి రైల్వేస్టేషను వరకు ర్యాలీగా వెళుతూ సభ్యత్వ నమోదు చేపట్టారు. పలువురు సభ్యత్వాన్ని స్వీకరించగా, వారిని క్లబ్‌లోకి ఆహ్వానించారు. రోటరీ క్లబ్ కార్యదర్శి దేవయజనం మురళీకృష్ణ, అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీకృష్ణ, మెంబర్‌షిప్ చైర్ ఈదర వెంకట పూర్ణచంద్, మాజీ అసిస్టెంట్ గవర్నర్ గుత్తా వెంకటరత్నం, మాజీ అధ్యక్షుడు పావులూరి రాంబాబు, కుర్రా శ్రీనివాసరావు, గుమ్మడి వెంకట నారాయణ, ఆలపాటి కిరణ్‌చౌదరి, డాక్టర్ కె.రామరాజు, డాక్టర్ ఆలపాటి సందీప్, ఆలపాటి వెంకట్రామయ్య పాల్గొన్నారు.

నవంబరు కల్లా మురుగునీటి శుద్ధి ప్లాంటు సిద్ధం



ప్లాంటును పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

తెనాలి: పట్టణ పూలే కాలనీలో కేంద్ర ప్రభుత్వ అమృత్ పథకం కింద మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని (ఎస్‌టీపీ) నవంబరు ఒకటో తేదీ నాటికి అందుబాటులోకి తీసుకు వస్తానని రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. ఎస్‌టీపీ ప్లాంటును ఆదివారం అధికారులతో కలిసి పరిశీలించారు. అధికారుల నుంచి వివరాలను తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం అమృత్ ప్రాజెక్టు కింద మంజూరుచేసిన ఈ ప్రాజెక్టు పనులు అసంపూర్తిగా నిలిచిపోయినట్టు చెప్పారు. అరవై రోజుల్లోగా పూర్తిచేస్తామని హామీనిచ్చారు. అనంతరం పట్టణంలో అమలులో ఉన్న రక్షిత మంచినీటి పథకం పనుల్ని కూడా సమీక్ష చేస్తానని మంత్రి చెప్పారు. మరికొన్ని వార్డుల్లో పైపులైన్లు వేసి తాగునీటిని ఇవ్వాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. వీటి తర్వాత భూగర్భ డ్రెయినేజీ పథకం అమలుపై సమావేశం నిర్వహిస్తానని చెప్పారు. కార్యక్రమంలో ప్రజారోగ్యశాఖ, గుంటూరు ఎస్ఈ కె.శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, మంత్రి ఓఎస్‌డీ ఏసురత్నం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును టీడీపీ, జనసేన వ్యతిరేకించాలి

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ సమాజాన్ని విచ్ఛిన్నం చేసే వక్ఫ్ సవరణ బిల్లును తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీలు వ్యతిరేకించాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని డిమాండ్ చేశారు. ఆదివారం దుగ్గిరాలలో విలేకరులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ వక్ఫ్ బోర్డుల స్వయం ప్రతిపత్తిని కేంద్ర ప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకోవాలని కుట్రపూరితమైన ధోరణితో ముందుకు వెళ్తోందని అన్నారు. సమావేశంలో మైనార్టీ నేతలు షేక్ రషీద్ సాహెబ్, షేక్ జానీ సైదా పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్‌లు రద్దు చేయాలి

తెనాలి: రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 17నుంచి 22 వరకు జరగనున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్ని ప్రభుత్వం రద్దు చేయాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శులు బట్టు వెంకయ్య, జి.వేమయ్య ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. నెలకు రెండు చొప్పున ఎనిమిది నెలలపాటు జరగనున్న 16 కాంప్లెక్సుల కారణంగా పాఠశాలల్లో బోధన కుంటుపడుతుందని వారు అభిప్రాయపడ్డారు. స్కూల్ కాంప్లెక్స్‌ల వల్ల ఎటువంటి ప్రయోజనం లేకపోగా, కబుర్లతో కాలక్షేపం చేయాల్సి వస్తుందని తెలిపారు.